క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికే హెల్ప్‌లైన్


ప్రిన్సిపాల్ అనిత

గజ్వేల్‌రూరల్: డిగ్రీలో ప్రవేశానికి 'దోస్త్' ద్వారా దరఖాస్తు చేసుకునే విద్యార్థుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేశారని ప్రిన్సిపాల్ అనిత అబ్రహం చెప్పారు. ఈ సందర్భంగా మంగళవారం ఆమె మాట్లాడుతూ ఈ హెల్ప్‌లైన్ సెంటర్ జిల్లాకు ఒక్కటే ఉంటుందని, ప్రస్తుతం ఈ కళాశాలకు కేటాయించారన్నారు. అడ్మిషన్ సమయంలో సమస్యలు తలెత్తినట్లయితే గతంలో సిద్దిపేటకు వెళ్ళాల్సి వచ్చేదని, కానీ ప్రస్తుతం ఇక్కడే పరిష్కరించుకునేందుకు అవకాశముందని చెప్పారు. దోస్త్ హెల్ప్‌లైన్ సెంటర్‌లో అధ్యాపకుడు డాక్టర్ జయరాజు, టెక్నికల్ అసిస్టెంట్ విజయ్ అందుబాటులో ఉంటారని చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇసుక డంపులు స్వాధీనం


ఇసుక డంపులను స్వాధీనం చేసుకుంటున్న తహసీల్దార్ మధుసూదన్

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని జాలపల్లిలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ మధుసూదన్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామ శివారులో దాదాపు 20 ప్రాంతాల్లో 100కుపైగా ట్రాక్టర్ల ఇసుకను స్వాధీనం చేసుకున్నామన్నారు. తాము స్వాధీనం చేసుకున్న ఇసుకను ఎవరూ ముట్టకూడదని, అలా చేస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ఆర్ఐ రవీందర్ తదితరులు ఉన్నారు.

న్యాయం చేయండి


సంఘీభావం తెలుపుతున్న రామచంద్రం

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని బేగంపేటలో భూ రికార్డు మార్పిడి చేయడం వల్ల నష్టపోయిన మల్లేశం కుటుంబానికి న్యాయం చేయాలని బీఎస్పీ సెంట్రల్ కోఆర్డినేటర్ నిశాని రామచంద్రం డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బాధిత కుటుంబానికి మంగళవారం ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధరణిలో జరిగిన తప్పిదాన్ని సవరించాలని కోరినా న్యాయం జరుగలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఇచ్చిన ఆదేశాలు, కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించిన తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మల్లేశం కుటుంబ సభ్యులు, బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటానికి సిద్ధం


కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

సిద్దిపేటజోన్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాన్ని చేపట్టడానికి సిద్ధంగా ఉన్నామని ఏచ్ఎంఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లేశం, సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాల్ స్వామి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్ చెప్పారు. అఖిల భారత కార్మిక సంఘాల పిలుపు మేరకు మంగళవారం పట్టణంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దుచేసి లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. అవి అమలు జరిగితే కోట్లాది కార్మికులు తమ ఉనికిని కోల్పోయే ప్రమాదం ఉందని, వెంటనే వాటిని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. నాయకులు రవి, కనకయ్య, వెంకటయ్య, సుధాకర్, సంపత్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ పిరమిడ్ కేంద్రం వార్షికోత్సవం

దుబ్బాకటౌన్: మూగ జీవాల పరిరక్షణ, ప్రపంచ శాంతి కోసం ప్రతిఒక్కరు పాటు పడాలని పిరమిడ్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు, ధ్యాన గద్దర్ భూపతి రాజు కోరారు. దుబ్బాకలోని శ్రీకృష్ణ పిరమిడ్ కేంద్రం 3వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ధ్యాన సాధకులు మంగళవారం మహా కరుణ ర్యాలీ నిర్వహించారు. సిద్దిపేట, మెదక్, సిరిసిల్ల, గజ్వేల్ తదితర ప్రాంతాల నుంచి ధ్యాన సాధకులు, పిరమిడ్ మాస్టర్లు తరలి వచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ధ్యాన సాధన చేయాలని కోరారు. అనంతరం వైశ్య భవన్‌లో ధ్యాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పిరమిడ్ కేంద్రం నిర్వాహకులు అంబటి కమల, సాయిబాబా, మాస్టర్లు శ్రీనివాస్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

కంకర కష్టాలు.. కనికరించరూ!


కంకర వేసిన వదిలేసిన కట్కూర్- దాస్‌తండా రోడ్డు

మంత్రివర్యా జర దేఖో..

- యేడాది గడిచినా తారు వేయలేదు
- ధ్వంసమైన కాయతండా–దాస్‌తండా రోడ్డు
- గాయాలపాలవుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, కాంట్రాక్టర్

'దేవుడు వరమిచ్చినా.. పూజారి కనికరించడం లేదు' అన్నట్లుగా మారింది కట్కూర్ నుంచి వంకాయతండా మీదుగా దాస్‌తండా వెళ్లే రోడ్డు దుస్థితి. ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలు, తండాల రోడ్లకు వేలకోట్ల రూపాయాలు ఖర్చు చేస్తున్నా గుత్తేదారుల అలసత్వం ప్రజలకు శాపంగా మారుతోంది.

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని కట్కూర్ నుంచి వంకాయతండా మీదుగా దాస్‌తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి సుమారు రూ.3.20 కోట్ల నిధులు మంజూరయ్యాయి. దీంతో గుత్తేదారుడు గతేడాది జూన్, జూలైలో బీటీ రోడ్డు నిర్మాణం కోసం పనులు ప్రారంభించి కంకరపోసి పనులు నిలిపివేశాడు.

మంత్రి పొన్నంపైనే ఆశలు

రోడ్డుపై కంకరవేసి దాదాపు యేడాది కావస్తోంది. కాని తారు మాత్రం వేయలేదు. ఈ కంకర వేసిన రోడ్డుపైనే వంకాయతండా, పంచరాయితండా, దాస్‌తండా ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ రోడ్డు సుమారు 3.5 కిలోమీటర్ల మేరకు ఉంటుంది. కంకర వేసి ఉండడంతో వాహనాలు స్కిడ్ అవడంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికే 5, 6 ద్విచక్రవాహనదారులు అదుపు తప్పి గాయాల పాలయ్యారు. దాస్‌తండాకు చెందిన శ్రీనివాస్ తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో ఆయా తండాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అత్యవసర పరిస్థితుల్లో అవస్థలు

రోడ్డుపై కంకరవేసి వదిలేయడంతో తండాలకు చెందిన గర్భిణులు, పిల్లలు, రోగులను ఆస్పత్రులకు తీసుకెళ్లాలంటే అవస్థలు తప్పడంలేదు. ఈ రోడ్డుపై ప్రయాణించే వాహనాలు సైతం దెబ్బతింటున్నాయని వాహన యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కంకర రహదారిపై ప్రయాణం అంటేనే నరకం కనిపిస్తోందని తండా వాసులు వాపోతున్నారు.

పట్టించుకోని గుత్తేదారు

తారు వేసి పనులు పూర్తిచేయాలని గుత్తేదారును పలుమార్లు కోరినా పనులు ప్రారంభించడంలేదని తండవాసులు ఆందోళన చెందుతున్నారు. పట్టించుకునే నాథుడే కరువయ్యాడని వాపోతు న్నారు. ఇప్పటికైనా మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టిసారించి కంకర వేసిన రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని వేడుకుంటున్నారు.

ప్రాణాలు పోతే తప్ప స్పందించరా..

కంకర పోసిన రహదారిపై ప్రయాణంతో ప్రతిరోజు నరకం అనుభవిస్తున్నాం. చాలా మంది వాహనదారులు తీవ్రమైన గాయాలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ కంకర రోడ్డుపై పాలు పోసేందుకు వెళ్లే వృద్ధులు, యువకులు వాహనాలు స్కిడ్ అవ్వడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రాణాలు పోతే తప్ప అధికారులు స్పందించరా? ఇకనైనా మంత్రి పొన్నం స్పందించి తారురోడ్డు పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి.

- గుగులోతు లకపతినాయక్, దాస్‌తండా

బిల్లులు రాలేదు..

రోడ్డుకు కంకర వేసి మధ్యలో వదిలేసిన విషయం తెలుసు. బీటీ రోడ్డు పనులు చేయాలని సదరు గుత్తేదారుకు రోజూ చెప్తున్నాం. ఇప్పటి వరకు చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో గుత్తేదారుడు పనులు చేసేందుకు ముందుకు రావడంలేదు. వేసవిలోనే బీటీ రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరుతున్నాం. ఈ రోడ్డుపై ప్రయాణం చాలా ఇబ్బందికరంగా ఉంటుంది.

- దిలీప్, గిరిజనశాఖ, ఏఈ

సులభంగా అర్థమయ్యేలా బోధన

- ఎంఈఓ కృష్ణ
- ఉపాధ్యాయులకు ప్రారంభమైన శిక్షణ


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ కృష్ణ


మిరుదొడ్డి(దుబ్బాక): మాట్లాడుతున్న ఎంఈఓ ప్రవీణ్‌బాబు

గజ్వేల్‌రూరల్/దుబ్బాకటౌన్/మిరుదొడ్డి(దుబ్బాక)/నంగునూరు(సిద్దిపేట)/కొమురవెల్లి(సిద్దిపేట)/మద్దూరు(హుస్నాబాద్)/బెజ్జంకి(సిద్దిపేట)/కొండపాక(గజ్వేల్)/దౌల్తాబాద్(దుబ్బాక)/తొగుట(దుబ్బాక): విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధించేందుకే ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు గజ్వేల్ ఎంఈఓ కృష్ణ చెప్పారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లోగల బాలుర ఉన్నత పాఠశాలలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటపాటల ద్వారా విద్యార్థులకు ఏ విధంగా బోధించాలి, సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠ్యాంశాలను బోధించడం వంటి విషయాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. 5 రోజుల పాటు జరిగే ఈ శిక్షణలో 132 మంది ఉపాధ్యాయులు పాల్గొంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల్ రీసోర్స్ పర్సన్‌లు వెంకటేశం, శ్యామల, శ్రీనివాస్, కనకరాజు, ప్రవీణ్‌చారి, సురేశ్, లింగం, విద్యాసాగర్ పాల్గొన్నారు. రాయపోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణరెడ్డి ఉపాధ్యాయల శిక్షణ తరగతులను ప్రారంభించారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు. మిరుదొడ్డిలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎంఈఓ ప్రవీణ్‌బాబు మాట్లాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీయడానికి ఉపాధ్యాయులు మరింత పదును పెట్టాలని సూచించారు. చెప్యాల కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్, ఎమ్మార్పీలు చంద్రశేఖర్, కృష్ణమూర్తి, రమేశ్, నగేశ్, నరేశ్, అమరేంద్రచారి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. నంగునూరు మండలం నర్మేటలో ఎంఈఓ దేశిరెడ్డి శిక్షణ తరగతులను ప్రారంభించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం ప్రభాకర్‌రావు, రిసోర్స్ పర్సన్లు చంద్రం, నాగయ్య, శ్రవంతి, శ్రీనివాస్, ఎల్లం, బాలమల్లు తదితరులు పాల్గొన్నారు. కొమురవెల్లిలోని కేజీబీవీలో మండల విద్యాధికారి రమేశ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని చెప్పారు. మద్దూరు, దూళ్మిట్ట మండలాల విద్యాశాఖ అధికారులు వరద రాజు, మీనాంజనేయులు మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలల్లో ఉపాధ్యాయవృత్యాంతర శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాంకేతిక అంశాలను జోడించి విద్యను బోధించాలన్నారు. బెజ్జంకి, కుకునూరుపల్లి, దౌల్తాబాద్‌లోని పాఠశాలల్లో ఎంఈఓలు మహతిలక్ష్మి, బచ్చలి సత్తయ్య, గజ్జెల కనకరాజు ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాలలో డీఆర్పీ శ్రీనివాస్‌రెడ్డి, రిసోర్సు పర్సన్స్ సత్యకృష్ణ, రాంప్రసాద్, అశోక్, శ్రీనివాస్, రాంచంద్రం, వెంకటరమణ, రిసోర్స్ పర్సన్ సర్దార్ హుస్సేన్ త్యాగ రాజు, వేణు గోపాల్, అనిత, శివ కుమార్ మెహరాజ్ బేగం, రవి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. అలాగే తొగుట మండలం గుడికందుల పాఠశాలలో ఎంఈఓ నర్సయ్య శిక్షణ కార్యక్రమంప్రారంభించారు. హెచ్‌ఎం అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులు దళారులను ఆశ్రయించవద్దు


అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

కోహెడరూరల్(హుస్నాబాద్): రైతులు దళారులను ఆశ్రయించవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి లాభాలు పొందాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. మండలంలోని నాగసముద్రాల గ్రామంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. ఇప్పటి వరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారు, రైతులకు డబ్బులు జమ అయ్యాయా లేదా అనే విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలను కల్పించాలన్నారు. కార్యక్రమంలో పీడీ జయ్‌దేవ్‌ఆర్య, జెడ్పీ సీఈఓ రమేశ్, సివిల్ సప్లయ్ డీఎం ప్రవీణ్, పంచాయతీరాజ్ డీఈ మహేశ్, భగీరథ డీఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బానిసలుగా చేసేందుకే లేబర్ కోడ్‌లు

సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన


దుబ్బాకలో ప్ర కార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

దుబ్బాకటౌన్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దుచేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కోశాధికారి భాస్కర్ మాట్లాడుతూ ఈ లేబర్ కోడ్‌ల వల్ల కార్మికులు బానిసలుగా మారే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను విదేశీ, స్వదేశీ కార్పొరేట్లకు అప్పగిస్తూ కేంద్రం దేశ సంపదను లూటీ చేస్తుందని విమర్శించారు. కార్మికుల 8 గంటల పనివిధానాన్ని 12 గంటలకు మారుస్తూ ప్రభుత్వం శ్రమ దోపిడీకి పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధనవంతులకు లక్షల కోట్లు రుణాలు మాఫీ చేస్తుందని, సామాన్య ప్రజలపై మాత్రం ధరల భారం మోపుతోందని మండిపడ్డారు. కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు మల్లేశం, మహేశ్, బాబాయి, చంద్రకళ, స్వరూప, పద్మ , కవిత, సింధుజ, లత, లావణ్య, నరసవ్వ, సునీత, విజయలక్ష్మి, మమత, మాధవి తదితరులున్నారు.

మిరుదొడ్డిలో ..

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డిలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి మద్దెల అంజయ్య మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలతోపాటు, మతోన్మాదాన్ని పెంచి పోషిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తుందని మండిపడ్డారు. కేంద్రం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టడానికి ఉద్యమిస్తామన్నారు. నాయకులు మల్లేశం, నవీన్, మహేశ్, రాజు, దేవదాసు, కిష్టయ్య, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం చెల్లించాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): లేబర్ కోడ్‌లను రద్దు చేయడంతోపాటు కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని సీఐటీయూ మండల కన్వీనర్ మరాఠి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట లేబర్‌కోడ్‌లకు వ్యతిరేకంగా మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నర్సింహులు, యాదయ్య, కనకమ్మ, కిష్టయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా వాడకాన్ని తగ్గించాలి

డాక్టర్ శ్రీజయ



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రీజయ

కొమురవెల్లి(సిద్దిపేట): రైతులు యూరియా వాడకాన్ని తగ్గించి వరి పంటకు బదులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని వ్యవసాయ పరిశోధన స్థానం తోర్నాల ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీజయ రైతులకు సూచించారు. మండలంలోని మర్రిముచ్చాల రైతువేదికలో మంగళవారం 'రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె జిల్లా వ్యవసాయ అధికారి రాధికతో కలసి రైతులకు వర్షాకాలం పంట సాగు పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. రైతులు అవసరం మేరకే రసాయనాలను వాడి భూసారాన్ని కాపాడాలని సూచించారు. డాక్టర్ పల్లవి, మండల వ్యవసాయ అధికారి భోగేశ్వర్, హార్టికల్చర్ అధికారి కౌసల్య, ఆయిల్‌ఫెడ్ జిల్లా మేనేజర్ భాస్కర్, పంచాయతీ కార్యదర్శి రాజమణి తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

వర్గల్(గజ్వేల్): భూసార పరీక్ష ఆధారంగా ఎరువులు వినియోగిస్తే నేలను కాపాడుకోవచ్చని శాస్త్రవేత్తలు ఆర్.విజయకుమారి, కె.సుమాలిని సూచించారు. జబ్బాపూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఏఈఓ సంతోష్, రైతులు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌కు దళితరత్న అవార్డు


శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న స్థానికులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్ గ్రామానికి చెందిన తెలంగాణ సాంస్కృతిక సారథి, కళాకారుడు పన్నీరు శ్రీనివాస్‌కు దళితరత్న అవార్డు వరించింది. సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబుజగ్జీవన్‌రామ్ మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా అవార్డును మంగళవారం అందుకున్నారు. 25 ఏళ్లుగా కళారంగంలో సేవలు అందిస్తున్నందుకు అవార్డు వరించిందన్నారు. ఈ సందర్భంగా స్థానికులు శ్రీనివాస్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సంజీవ, రత్నం, శంకర్, కనకరాజు, సంజీవ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లుపడి గేదె మృతి

దుబ్బాక: విద్యుత్ వైర్లు పడటంతో ఓ గేదె మృతి చెందింది. గ్రామస్తుల కథనం ప్రకారం పట్టణానికి చెందిన రైతు లక్కిరెడ్డి ఎల్లారెడ్డి పాడిగేదెపై మంగళవారం ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తెగి పడ్డాయి. దీంతో విద్యుదాఘాతానికి గురైన గేదె అక్కడికక్కడే మృతి చెందింది. విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. గేదె విలువ రూ.50 వేలు ఉంటుందని, తనను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు వేడుకున్నాడు.

టార్పాలిన్‌లు అందజేత

బెజ్జంకి(సిద్దిపేట): వ్యవసాయ మార్కెట్ పరిధిలోని గన్నేరువరం మండలంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు చైర్మన్ పులి కృష్ణ మంగళవారం టార్పాలిన్‌లను అందజేశారు. కరీంనగర్ డీఎంఓ నుంచి 200 టార్పాలిన్‌లు ఐకేపీ, డీసీఎంఎస్‌ల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్‌లు మల్లేశం, పోచయ్య, చంద్రారెడ్డి, నర్సయ్య, కుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

దేశ విదేశాలకు అలయన్స్ సేవలు

క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్


మాట్లాడుతున్న రాజ్‌కుమార్ సక్సేనా

కొండపాక(గజ్వేల్): అలయన్స్ క్లబ్ సేవలు దేశ విదేశాలకు విస్తరించాయని ఆ క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ సక్సేనా అన్నారు. కుకునూరుపల్లిలో పీఎన్ఆర్ ట్రస్టు నిర్వాహకులు పాల్కంపల్లి నరేందర్ సహకారంతో మంగళవారం క్లబ్ సేవలను ప్రారంభించారు. అంతకు ముందు క్లబ్ సిద్దిపేట డివిజన్ అధ్యక్షుడిగా పాల్కంపల్లి నరేందర్‌ను నియమించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ 32 దేశాల్లో క్లబ్ సేవలు కొనసాగుతున్నాయన్నారు. సామాజిక సేవ చేయడమే లక్ష్యంగా పనిచేస్తుందని చెప్పారు. అనంతరం టౌన్ అధ్యక్షుడు ఐలయ్య, మండల అధ్యక్షుడు రుషితోపాటు పలువురిని సభ్యులుగా నియమించారు. జిల్లా గవర్నర్ గందే ఈశ్వర్ చరణ్, సభ్యులు తిరుపతిరాజు, పెద్ది వైకుంఠం, శ్రీనివాస్, సతీశ్‌కుమార్, ఆత్మరాములు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై విమర్శలు సరికాదు


సమావేశంలో మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

గజ్వేల్: ధాన్యం కొనుగోళ్లను వేగంగా చేపట్టడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుంటే బీఆర్ఎస్ నేత వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించడం సరికాదని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. మార్కెట్ కమిటీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అకాల వర్షాల వల్ల కొన్నిచోట్ల కొనుగోళ్లు ఆలస్యమవుతున్నాయని, రైతులకు ఇబ్బందులేకుండా చూస్తున్నామని చెప్పారు. లారీలు, గన్నీ బ్యాగుల కొరతేమీ లేదన్నారు. మరోవైపు కొనుగోళ్లు జరగగానే వెంటనే చెల్లింపులు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. రైతులను రెచ్చగొట్టే వ్యాఖ్యలు మానుకోవాలని సూచించారు. సమావేశంలో వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, డైరెక్టర్లు కర్ణాకర్‌రెడ్డి, నర్సాగౌడ్, యాదగిరి, రాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ క్రికెట్ బెట్టింగ్‌లతో జీవితాలు నాశనం



అక్కన్నపేట(హుస్నాబాద్): ఆన్‌లైన్, క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే జీవితాలు నాశనమవుతాయని ఎస్ఐ విజయ్‌భాస్కర్ అన్నారు. మండల కేంద్రంలో పోలీసు కళాబృందం ప్రజలను చైతన్యపరిచే కనువిప్పు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూఢనమ్మకాలతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకొని శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. హెల్మెట్ ధరించాలని, గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు వ్యాపారస్తులు, నాయకులు సహకరించాలని కోరారు.

◆ సీసీ రోడ్లు నిర్మించాలని వినతి

బెజ్జంకి(సిద్దిపేట): సీసీ రోడ్లు, బోర్లు మంజూరు చేయాలని బెజ్జంకి నాయకులు కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. బెజ్జంకి, కల్లెపెల్లి గ్రామాలలో సీసీ రోడ్లతో పాటు ధ్వంసమైన ప్రధాన రోడ్లకు నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అజయ్‌వర్మ, అశోక్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

◆ మండల టాపర్‌కు సన్మానం

బెజ్జంకి(సిద్దిపేట): పదో తరగతిలో మండల టాపర్‌గా నిలిచిన బెజ్జంకి విద్యార్థిని శానగొండ అశ్విని‌ని మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. రజిత పతకం, కొంత నగదును బహూకరించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ నాయకులు పాల్గొన్నారు.



◆ ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని వెలికట్ట క్రాస్‌రోడ్డు వద్ద నిర్వహించిన కొండపాక మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. టోర్నీలో 17జట్లు పాల్గొనగా ఫైనల్‌లో బందారం, అంకిరెడ్డిపల్లి జట్లు తలపడ్డాయి. మొదటి స్థానంలో బందారం, ద్వితీయ స్థానంలో అంకిరెడ్డిపల్లి జట్లు గెలుపొందగా మొదటి స్థానంలో నిలిచిన జట్టుకు, రూ.15వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.8వేలు నగదును అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన క్రీడాకారుడికి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పరశురాం రూ.వెయ్యి అందజేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లింగారావు, నాయకుడు ఆరుట్ల సంపత్ మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. పీఏసీఎస్ డైరెక్టరు సురేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

◆ మహిళా సమాఖ్య భవనంలో చోరీ

సిద్దిపేటఅర్బన్: మండలంలోని ఎల్లుపల్లి శివారులోని జిల్లా మహిళా సమాఖ్య భవనంలో చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శనివారం సాయంత్రం ఎప్పటిలాగే మహిళా సమాఖ్య భవనంలో పనిచేసే ఉద్యోగులు విధులు ముగించుకొని తాళం వేసి వెళ్లిపోయారు. సోమవారం ఉదయం వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించారు. లోపలికి వెళ్లి చూడగా లోపల బిగించిన నల్లాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తులు భవనంలోని మొత్తం 52 నల్లాలను చోరీ చేశారని, వాటి విలువ సుమారు రూ.10 వేలకు పైగా ఉంటుందని సమాచారం. ఈ ఘటనపై మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గౌతమి ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

◆ పట్టాలను రద్దు చేయాలని వినతి

అక్కన్నపేట(హుస్నాబాద్): తరతరాలుగా సాగు చేసుకుంటూ జీవిస్తున్న దాదాపు 80 ఎకరాల భూమిని ఇతరుల పేర్లపై పట్టాలు చేశారని, వెంటనే వాటిని రద్దు చేయాలని కోరుతూ పెద్దతండా గ్రామస్తులు తహసీల్దార్ అనంతరెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు తిరుపతినాయక్ మాట్లాడుతూ పెద్దతండా, మోత్కులపల్లి శివారులోని దాదాపు 80 ఎకరాల భూమికి కొంతమంది నాయకులు పట్టాలు చేసుకొని అమాయక ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా విచారణ జరిపించి వారి భూములను వారికే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గుగులోతు లకపతినాయక్, రాజునాయక్, తిరుపతినాయక్ తదితరులు పాల్గొన్నారు.